## క్లుప్తంగా

### పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కేటీఆర్, ప్రశాంత్‌రెడ్డి

**మన్సూరాబాద్:** గత 15 ఏళ్లుగా అనేక జాతీయ, రాష్ట్ర నాయకుల వద్ద పనిచేసిన రాజకీయ వ్యూహకర్త రామాకాంత్ రచించిన పవర్ ప్లే పుస్తకాన్ని మాజీ మంత్రి కేటీఆర్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమాకాంత్ మాట్లాడుతూ.. రాజకీయాల్లో విజయానికి వ్యూహం అత్యంత కీలకమని, అనుభవం, సీనియర్ నాయకుల సూచనలు, మేధావుల సలహాలను కలిపి పుస్తకాన్ని రాశానన్నారు. బూత్‌స్థాయి కార్యకర్త నుంచి రాష్ట్రస్థాయి నాయకుడి వరకు వ్యూహకర్తగా ఎదగాలనే వారికి ఉపయోగపడుతుందని స్పష్టం చేశారు. రాజకీయాల్లో తిరుగుతూ యువకులు డబ్బు, సమయం, శ్రమ ఖర్చు చేస్తున్నారని, వారికి ఈ పుస్తకం ఎంతగానో దోహదపడుతుందన్నారు. పుస్తకావిష్కరణలో మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నేత సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

### రెండేళ్ల తర్వాత భారీగా ఉల్లి దిగుమతి

**చాదర్‌ఘాట్:** రెండేళ్ల తర్వాత మలక్‌పేటలోని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్‌కు భారీగా ఉల్లి దిగుమతి అయ్యింది. మహారాష్ట్ర, కర్నాటక, మెదక్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి 176 లారీలు సరుకు మార్కెట్‌కు వచ్చింది. దాదాపు 52,720 బస్తాలను మార్కెట్‌లో నిల్వ చేశారు. రెండేళ్ల తర్వాత ఇంత ఉల్లి దిగుమతి ఇదే మొదటిసారి అని అధికారులు తెలిపారు. దాదాపు రూ.3.50 కోట్ల మేర వ్యాపారం టర్నోవర్ అయిందని అదే విధంగా రూ. 3 లక్షలకు పైగా మార్కెట్ ఫీజు వసూలైందని అధికారులు వెల్లడించారు.

### అంకుల్ మా మొర ఆలకించండి..



కాలనీ అధ్యక్షుడికి వినతి పత్రం అందజేస్తున్న చిన్నారులు

**మన్సూరాబాద్:** కాలనీలోని వీధి కుక్కల బారి నుంచి తమను రక్షించాలని హైదరాబాద్ టాలెంట్ స్కూల్ విద్యార్థులు మంగళవారం సహారాస్టేట్స్‌కాలనీలో ర్యాలీ నిర్వహించి కాలనీ అధ్యక్షుడు సయ్యద్‌జానీకి వినతిపత్రం అందజేశారు. కాలనీలో గుంపులుగా సంచరిస్తున్న కుక్కలతో ఇబ్బంది పడుతున్నారని స్కూల్‌కు వెళ్లే సమయంలో దాడులు చేస్తున్నాయని ఉపాధ్యాయులు తెలిపారు. సయ్యద్ జానీ మాట్లాడుతూ.. వీధి కుక్కల సమస్యపై పలుమార్లు ఫిర్యాదు చేశామని, కాలనీవాసులు వీధి కుక్కలకు ఆహారం పెట్టవద్దని సూచించారు. త్వరలోనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

### రోగులకు పండ్ల పంపిణీ

**వనస్థలిపురం:** మదర్ థెరిస్సా జయంతిని పురస్కరించుకుని మంగళవారం మదర్ థెరిస్సా చారిటబుల్ సొసైటీ అధ్యక్షుడు చేపూరి శంకర్ ఆధ్వర్యంలో వనస్థలిపురం ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. మదర్ థెరిస్సాను ఆదర్శంగా తీసుకుని అందరం సామాజిక సేవ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎంఓ డా.జయమాల, డా.అనిల్, సొసైటీ సభ్యులు సునీత, సందీప్, చంద్రకాంత్ పాల్గొన్నారు.

### ఆర్థిక సాయం అందజేత



**మన్సూరాబాద్:** అనారోగ్య సమస్యతో బాధపడుతున్న మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ పరిధి బొమ్మలగుడి ప్రాంతానికి చెందిన రాంపల్లి రామేశ్వరి కుటుంబానికి బీజేపీ నేత మొరిశెట్టి సంతోష్‌కుమార్ మంగళవారం పరామర్శించారు. అనంతరం రూ.20 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కడారి యాదగిరియాదవ్, జయతేజ తదితరులు పాల్గొన్నారు.

### వృద్ధుడి అదృశ్యం

**హస్తినాపురం:** ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన ఓ వృద్ధుడు అదృశ్యమైన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. వీరాంజనేయకాలనీలో నివాసముంటున్న మహ్మద్ గౌస్ మొహినుద్దీన్ (82) సోమవారం ఉదయం ఎస్‌బీఐ బ్యాంక్‌కు వెళ్లి వస్తానని చెప్పి ఎంతకీ ఇంటికి రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు సమీప బంధువులు, స్నేహితులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## మట్టి వినాయకులను పూజిద్దాం..
# పర్యావరణాన్ని పరిరక్షిద్దాం



తుక్కుగూడ: సర్దార్‌నగర్‌లో విగ్రహాలను పంపిణీ చేస్తున్న పుర సిబ్బంది





బడంగ్‌పేట్: విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌గుప్తా

**మహేశ్వరం:** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ నడుం బిగించి, మట్టి వినాయకులను పూజించాలని సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఘట్టుపల్లి వీరాంజనేయస్వామి ఆలయంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గొల్లూరు రాజు ఆధ్వర్యంలో భక్తులకు మట్టి వినాయకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంగులు, రసాయనాలతో చేసిన వినాయక ప్రతిమలను నీటిలో నిమజ్జనం చేయడంతో జల కాలుష్యం ఏర్పడుతుందని, పర్యావరణ పరిరక్షణకు ముప్పు వాటిల్లుతుందని తెలిపారు. వినాయక చవితి ఉత్సవాల్లో పర్యావరణ హిత గణపతులకు ప్రాధాన్యత ఇచ్చి భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన గాలిని అందించాలని ఆయన సూచించారు. గొల్లూరు రాజు సామాజిక స్పృహతో మట్టి గణపతులను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. అంతకు ముందు ఆలయానికి వచ్చిన భక్తులకు మట్టి గణపతులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ ప్రసాద్, కాంగ్రెస్ కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు ఇమ్మడి ప్రవీణ్, నాయకులు ఆవుల రమేశ్, మంత్రి బాల్‌రాజ్, బొల్లు కుమార్, సుధాకర్, నాగేందర్, భాస్కర్, రవీందర్, రాజశేఖర్, ఆకాష్, విజేయందర్, రాజు నాయక్, గణేష్, శ్రీకాంత్ పలువురు పాల్గొన్నారు.



మహేశ్వరం: మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్న సీఐ వెంకటేశ్వర్లు, నాయకులు

**విగ్రహాల పంపిణీ**

**బడంగ్‌పేట్:** బడంగ్‌పేటలోని లార్డ్స్ ఒలంపియాడ్ స్కూల్‌లో విద్యార్థులకు వైస్ చైర్మన్ బి.శ్రీనివాస్‌రెడ్డి మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. అలాగే బాలాపూర్ ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో అధ్యక్షుడు నాళ్ల శ్రీనివాస్‌గుప్తా ఉచితంగా మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు.

**బడంగ్‌పేటలో..**

బడంగ్‌పేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు మంగళవారం మట్టి విగ్రహాలను తయారు చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఎన్‌ఎస్‌ఎస్ జాతీయ సేవా విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు భక్తిశ్రద్ధలతో మట్టి విగ్రహాలను తయారుచేశారు. కాలేజీలో విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. పర్యావరణం కాపాడుకోవడం అందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్ ప్రసాద్, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డా.ఎన్.జ్యోతి, డా.కిరణ్మయి, డా.వెంకట్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**పర్యావరణాన్ని పరిరక్షించాలి**

**తుక్కుగూడ:** ప్రతి ఒక్కరూ మట్టి గణపతులను ప్రతిష్ఠించి, పర్యావరణాన్ని పరిరక్షించాలని మాజీ కౌన్సిలర్ రెడ్డిగళ్ల సుమన్ అన్నారు. మంగళవారం తుక్కుగూడ పరిధిలోని సర్దార్‌నగర్‌లో మంగళవారం మట్టి గణపతులను పురపాలిక శాఖ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వినాయక చవితి వేడుకలను శాంతియుతంగా జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో పుర సిబ్బంది, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## సూర్యగిరి ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు

**తుక్కుగూడ:** మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మకు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచే దర్శనం కోసం భక్తులు క్యూలో ఉన్నారు. అమ్మవారికి ప్రత్యేకలంకరణ చేశారు. ఆలయ ప్రాగణంలో సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు చేశారు. నాగదేవతకు పుట్టలో పాలు పోసి పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, ఈఓ మోహన్‌రావు, సిబ్బంది మీగడ కాశీనాథ్, పూజారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేకలంకరణలో అమ్మవారు

## రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి



మాట్లాడుతున్న దేప భాస్కర్‌రెడ్డి

**దిల్‌సుఖ్‌నగర్:** రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని కాంగ్రెస్ సీనియర్ నాయకులు, టీపీసీసీ సభ్యులు దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. ఆర్‌కేపురం డివిజన్‌కు చెందిన వివిధ కాలనీ సంక్షేమ సంఘాల నేతలు మంగళవారం దేప భాస్కర్‌రెడ్డిని సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీల్లో రాజకీయాలు పక్కన పెట్టి అభివృద్ధి పనులు పూర్తి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, పారిశుద్ధ్య నిర్వహణ వీధి దీపాలు, పార్కుల ఏర్పాటు కోసం ప్రభుత్వ అధికారులను సమన్వయం చేసుకోవాలని వివరించారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా మండపాల నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఉపేందర్‌రెడ్డి, గణేష్ నేత, రమేష్ నేత, మహేందర్, భరద్వాజ్, రామారావు, సాయి, శ్యాంసుందర్, పెద్దపూర సైదులు, దుర్గా ప్రసాద్, శ్రీనివాస్, విజయలక్ష్మి, సుజాత రెడ్డి, జగిని ఉమా పాల్గొన్నారు.

## వ్యాపార ప్రణాళికలకు పారిశ్రామిక సదస్సులు దోహదం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎన్ఎస్ఐసీ అధికారులు

**మలక్‌పేట:** వ్యవస్థాపకత, వ్యాపార ప్రణాళికలు పెంపొందించడానికి పారిశ్రామిక సదస్సులు దోహదపడతాయని నోబుల్ విద్యా సంస్థల చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మూసారంబాగ్ డివిజన్ దిల్‌సుఖ్‌నగర్ నోబుల్ డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన 250 మంది విద్యార్థులు పారిశ్రామిక సందర్శనకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సొంతంగా స్టార్టప్‌ను ఏర్పాటు చేసుకుంటే పది మందికి జీవనోపాధి కల్పించవచ్చన్నారు. పారిశ్రామిక రంగం నిరుద్యోగులకు ఉపాధి కల్పించడంతో పాటు దేశ ఆర్థిక ప్రగతిలో ప్రధాన భూమిక పోషిస్తుందన్నారు. నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ (ఎన్‌ఎస్ఐసీ)-టీఎస్‌సీ జనరల్ మేనేజర్ అబ్దుల్ ఖాదర్ స్టార్టప్ కంపెనీ ప్రక్రియపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

## రూ.5.54కోట్లతో పరిగి రోడ్డుకు మరమ్మతులు

**ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**షాద్‌నగర్:** పరిగి రోడ్డుకు రూ.5.54 కోట్లతో మరమ్మతులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పట్టణ చౌరస్తా నుంచి కిషన్‌నగర్ వరకు ఉన్న రహదారికి మరమ్మతులు చేపట్టనున్నట్లు తెలిపారు. మిషన్ భగీరథ పైపులు పరిగి రోడ్డు మధ్యలో ఉండటంతో తరచూ లీకేజీలు ఏర్పడుతున్నాయని, ఫలితంగా రోడ్డు మొత్తం గుంతలుగా మారి వాహనాల రాకపోకలకు ఆటంకం కలుగుతుందన్నారు. సుమారు కిలోమీటర్నర మరమ్మతులకుగాను రోడ్డు భవనాలశాఖ నిధులు మంజూరు చేసిందని స్పష్టం చేశారు. ఈ పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియ కొనసాగుతోందని, నెలరోజుల్లో మరమ్మతులు ప్రారంభిస్తామని తెలిపారు. అదేవిధంగా రోడ్డు మధ్యలో డివైడర్, ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేస్తామని, మరమ్మతులు పూర్తయితే పరిగి రోడ్డు రూపురేఖలు మరింత మారిపోతాయన్నారు. అదేవిధంగా షాద్‌నగర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. ప్రభుత్వం పట్టణాలు, గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందని, ఇందుకుగాను కావాల్సిన నిధులు మంజూరు చేస్తుందన్నారు. సమావేశంలో నాయకుడు కాశీనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.



నిధుల మంజూరు పత్రాన్ని చూపిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

### డ్రైనేజీ పనులు పూర్తి చేయాలి

**మన్సూరాబాద్:** ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో నిలిచిపోయిన డ్రైనేజీ ట్రంక్‌లైన్ పనులను వెంటనే పూర్తిచేయాలని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డికి టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కిగౌడ్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మధుయాష్కిగౌడ్ మాట్లాడుతూ.. మన్సూరాబాద్ డివిజన్ వీరన్నగుట్ట వద్ద నిలిచిపోయిన డ్రైనేజీ ట్రంక్‌లైన్ పనులను వేగంగా పూర్తిచేయాలని కోరినట్లు తెలిపారు. ఈ ట్రంక్‌లైన్ సుమారు 20 కాలనీల వాసులకు డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు కానుందని, కాంట్రాక్టర్ రెండు నెలల క్రితం పనులను అర్ధంతరంగా వదిలేశాడని ఎంపీ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని జీఎం మహేందర్‌ను ఎండీ ఆదేశించారని పేర్కొన్నారు.

### డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి

**ఎల్‌బీనగర్:** డ్రైనేజీ సమస్యల శాశ్వతంగా పరిష్కరిస్తానని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధి గాంధీనగర్‌సౌత్ కాలనీలో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పైకాలనీల నుంచి వచ్చే డ్రైనేజీని సాగర్‌కాంప్లెక్స్ వద్ద ఉన్న కల్వర్ట్ కింద ఉన్న ట్రంక్‌లైన్‌లో కలపకుండా ఫారెస్ట్ గుండా వస్తుండటంతో కాలనీవాసులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రస్తుతానికి తాత్కాలిక చర్యలు చేపట్టనున్నట్లు, రాబోయే రోజుల్లో పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అరవిందరెడ్డి, సుమన్‌గౌడ్, సతీష్‌గౌడ్, అమరనాథ్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శంకరయ్య, సందీప్‌రెడ్డి, నరేన్‌రెడ్డి, సునిల్‌రెడ్డి, మల్లారెడ్డి కన్నానాయక్, సతీష్ పాల్గొన్నారు.

### అందుబాటులో సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు

**షాబాద్:** వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు సబ్సిడీపై పనిముట్లు అందజేస్తున్నట్లు మండల వ్యవసాయశాఖ అధికారి కృష్ణమోహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయశాఖ యాంత్రీకరణలో భాగంగా సన్న, చిన్నకారు ఎస్సీ, ఎస్టీ రైతులకు వ్యవసాయ యాంత్రీకరణపై ఉప-మిషన్ పథకం ద్వారా 40-50 శాతం రాయితీపై వ్యవసాయ పనిముట్లకు బడ్జెట్ కేటాయించారన్నారు. మండలానికి బ్యాటరీ స్ప్రేయర్లు-177, తైవాన్ స్ప్రేయర్లు-30, రోటవేటర్లు-09, ట్రాక్టర్ సంబంధిత పనిముట్లు(కల్టివేటర్, డిస్క్ హారో, ఎంబీప్లవ్, కేజీవీల్స్)-11, సీడ్ ఫర్టిలైజర్ డ్రిల్స్-02, బ్రష్ కట్టర్-08, మేజ్ షెలర్-01 వచ్చినట్లు తెలిపారు. ఈ రాయితీని పొందేందుకు ఎస్సీ, ఎస్టీ రైతులకు 50 శాతం సబ్సిడీ, ఇతర రైతులకు 40 శాతం సబ్సిడీ లభిస్తుందన్నారు. దరఖాస్తుదారుడి పేరుమీద భూమి ఉండాలన్నారు. భూమి పాస్‌బుక్, ఆధార్ కార్డు, రైతు ఫొటో, ట్రాక్టర్ ఆర్సీ(ట్రాక్టర్ సంబంధిత పనిముట్లకు మాత్రమే)తో ఈ నెల 28లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 29, 30 తేదీల్లో డీడీ కట్టుకోవాలని, ఎస్సీ, ఎస్టీ రైతులు కుల ధ్రువీకరణ పత్రం జతచేయాలని తెలిపారు.

## డ్రోన్ల వాడకంపై అవగాహన

**కందుకూరు:** మండల పరిధిలోని నేదునూరులో సీఆర్ఐడీఏ(సెంట్రల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డ్రైలాండ్ అగ్రికల్చర్) కేవీకే రంగారెడ్డి జిల్లా, వ్యవసాయ శాఖ అధికారి లావణ్య ఆధ్వర్యంలో మంగళవారం రైతులకు డ్రోన్ల ద్వారా పంటలపై మందుల పిచికారీపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కేవీకే హెడ్ డాక్టర్ చంద్రకాంత్ మాట్లాడుతూ.. ఆధునిక సాంకేతికత ఆధారిత వ్యవసాయ పద్ధతులు అవలంబించడంతో రైతుల ఉత్పాదకత పెరిగి, ఖర్చులు తగ్గుతాయన్నారు. అందులో భాగంగా డ్రోన్ల వాడకంతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. సమానంగా ఎరువులు, పురుగు మందుల పిచికారీ తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో వేయొచ్చన్నారు. శ్రమ తగ్గడం, రసాయనాల ప్రభావం నుంచి భద్రత కలుగుతుందన్నారు. రైతులు డ్రోన్లను ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ ఇంజనీర్ డాక్టర్ ఎస్.విజయ్‌కుమార్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ టీవీరావు, ఎస్ఎంఎస్(అగ్రానమీ) డాక్టర్ గౌతమ్‌వీర్‌చౌహాన్, అధికారులు జి.రాజు, డి.సునీత, డి.సాయికుమార్, రైతులు మల్లేశ్, మత్యాస్‌రెడ్డి, అంజయ్య, సామ్యూల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



డ్రోన్ల వాడకంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

## రహదారి నిర్మాణంపై హర్షం



రహదారి నిర్మాణ పనులను ప్రారంభించిన నాయకులు

**కందుకూరు:** మండల పరిధిలోని నేదునూరు మూలమలుపు నుంచి నేరుగా మాన్యగూడ మీదుగా మద్దెలకుంటతండా వరకు 7 కిలోమీటర్ల మేర 10 మీటర్ల వెడల్పు రహదారిలో 18 అడుగుల బీటీ నిర్మించడానికి ప్రభుత్వం రూ.10 కోట్ల నిధులు మంజూరు చేసింది. కొద్ది నెలల క్రితం మంత్రి శ్రీధర్‌బాబు చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం పనులు కొనసాగుతుండగా కొన్ని ప్రాంతాల్లో రహదారి వెడల్పు తక్కువగా ఉంది. దీంతో మంగళవారం మాజీ వైస్ ఎంపీపీ శమంతప్రభాకర్‌రెడ్డి, ఇందిరమ్మ కమిటీ మండల కోఆర్డినేటర్ ఎండీ అఫ్జల్‌బేగ్, పీఏసీఎస్ డైరెక్టర్ సాధ పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో రైతులతో మాట్లాడి 10 మీటర్ల రహదారి ఆ ప్రాంతంలో ఉండేలా ఒప్పించారు. దీంతో వారు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు వరికుప్పల బాబు, సర్గారి మాధవరెడ్డి, అంకగళ్ల దర్శన్, ఎగిరిశెట్టి శంకర్, వరికుప్పల రవి, సాయిరెడ్డిగూడ రమేశ్, ప్రభు, బోయ భాస్కర్, ఎండీ సద్దాం పాల్గొన్నారు.

## చెరువుల వద్ద రక్షణ చర్యలు చేపట్టాలని వినతి

**బడంగ్‌పేట్:** కార్పొరేషన్ పరిధిలోని అన్ని చెరువులకు రక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి మంగళవారం కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాదర్‌గుల్‌లోని సున్నం చెరువులో పడి బాలుడు మృతి చెందడం బాధాకర విషయమని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా మున్సిపల్ కార్పొరేషన్‌లోని చెరువుల చుట్టూ రక్షణ చర్యలు తీసుకోవాలని విన్నవించారు. స్పందించిన కేఎల్ఆర్ వెంటనే కమిషనర్ పి.సరస్వతితో మాట్లాడి నాదర్‌గుల్‌లోని సున్నం చెరువుతో పాటు బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని అన్ని చెరువుల చుట్టూ రక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వెంటనే చర్యలు, చెరువుల చుట్టూ ఫెన్సింగ్ వేయించే పనులు వెంటనే చేపడుతామని కమిషనర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎర్ర జైహింద్, బంగారు అశోక్, కుమార్‌యాదవ్, పుట్టగళ్ల భాస్కర్ తదితరులు ఉన్నారు.



కేఎల్ఆర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

## అంగన్‌బడికి మరమ్మతులు చేయిస్తా



అద్దె ఇంటిలోకి మార్చిన అంగన్‌వాడీ భవనం ఎదుట బొర్ర జగన్‌రెడ్డి

**మాజీ సర్పంచ్ బొర్ర జగన్‌రెడ్డి**

**బడంగ్‌పేట్:** సుల్తాన్‌పూర్‌లో శిథిలావస్థకు చేరిన అంగన్‌వాడీ భవనాన్ని సొంత ఖర్చుతో మరమ్మతులు చేయించి.. కలరింగ్ చేసి అప్పగిస్తానని మాజీ సర్పంచ్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బొర్ర జగన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 13వ డివిజన్ సుల్తాన్‌పూర్‌లో శిథిలావస్థకు చేరిన అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆగస్టు 15న జెండా వేడుకల్లో పరిశీలించానన్నారు. ఈ విషయాన్ని అధికారులకు, శిశుసంక్షేమ శాఖ అధికారులకు విన్నవించినట్లు తెలిపారు. అధికారులు చర్యలు తీసుకోవడంతో ఆలస్యం చేయడంతో అప్పటికే అన్ని ప్రచార మాధ్యమంలో వార్తలు వచ్చినట్లు తెలిపారు. మరోమారు అంగన్‌వాడీ సెంటర్‌ను సీడీపీఓ, వైద్యులతో కలిసి పరిశీలించామన్నారు. వారి విన్నపం మేరకు అంగన్‌వాడీ సెంటర్‌ను పాడుబడిన బిల్డింగ్‌నుంచి అదే గ్రామంలో ఇంటిని అద్దెకు తీసుకొని అందులో కొనసాగేలా చూస్తున్నామన్నారు. పాత భవనాన్ని మరమ్మతులు చేసి పేయింటింగ్‌ను వేసి అందుబాటులోకి తెస్తామని తన సొంత ఖర్చుతో రిపేర్లు చేస్తామన్నారు. కిరాయి అద్దె నెలకు రూ.4 వేలను కూడా తానే భరిస్తానని కమిషనర్ సరస్వతికి, సీడీఎంఏకు లెటర్‌ద్వారా విన్నవించారు. తన ఊరుకు, ఊరి పిల్లల భవిష్యత్తుకు ఈ సేవ చేసే భాగ్యం కలగటం సంతోషమన్నారు.

### ఉత్సవాలకు మండపాలు సిద్ధం

**తుక్కుగూడ:** వినాయక చవితి వేడుకలు జరుపుకోవడానికి పుర పరిధిలోని పలు గ్రామాల్లో మండపాలను ఉత్సవ కమిటీ సభ్యులు సిద్ధం చేశారు. మహా గణపతులను ప్రతిష్ఠించడానికి వివిధ ఆకారంలో మండపాలను ఏర్పాటు చేసి, విద్యుత్ దీపాలను అలంకరించారు. చవితి సందర్భంగా శ్రీశైలం జాతీయ రహదారి గణపతులు, ఆయా రకాల వస్తువుల కొనుగోళ్లతో రద్దీగా మారింది.



తుక్కుగూడలో ముస్తాబైన మండపం

## కట్టకు గండి పూడ్చివేత

సాక్షి ఎఫెక్ట్..



ఎర్రకుంటకు మట్టితో గండిని పూడ్చిన అధికారులు

**మొయినాబాద్‌రూరల్:** రైతులకు ఉపయోగపడుతున్న చెరువులు, కుంటలను కాపాడాలని ప్రభుత్వం చెబుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో కురిసిన వర్షాలకు వరద నీరు వృథాగా పోతోంది. ఈ విషయమై ఎర్రకుంటకు మరమ్మతులెప్పుడో అనే శీర్షికన సోమవారం ప్రచురితమైన కథనానికి ఇరిగేషన్ అధికారులు స్పందించారు. మండల పరిధిలోని బాకారం ఎర్రకుంటకు భారీ వర్షాలకు నిండుగా నీరు నిండి గండిపడి కట్ట కొట్టుకుపోయింది. దీంతో ఎర్రకుంటలోని నీరంతా వృథాగా పంటపొలాల నుంచి ఈసీవాగులోకి ప్రవహించింది. ఎర్రకుంట చుక్కనీరు లేక పిచ్చిమొక్కలతో ఎడారిగా దర్శనమిస్తోంది. స్పందించిన అధికారులు జేసీబీ సాయంతో కట్టను పూడ్చారు. దీంతో చుట్టుపక్కన రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ వర్షాలు కురిస్తే ఈ కుంటలో నీరు నిలిచి ఉంటుందని పేర్కొంటున్నారు.